ప్రజాశక్తి
శనివారం 22 నవంబర్ 2025
5



అల్లూరి సీతారామరాజు

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గడికించుమండ గ్రామంలో పరిశుభ్రత -పారిశుద్యం పై శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమన్నారు. పరిశుభ్రతపై గ్రామస్థాయి యాక్షన్ ప్లాన్ అమలు, చెత్త నిర్వహణ పద్ధతులు, తాగునీటి శుద్ధీకరణ, కాలువల సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత ఆరోగ్యం, ఇంటి పరిసర శుభ్రత, పర్యావరణ పరిరక్షణ ఒకదానికొకటి అనుబంధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి.ఈశ్వరమ్మ, ఎంపీటీసీ శెట్టి మహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో, ఏఓ సన్యాసిరావు హాజరయ్యారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

వైద్య విద్యార్థులకు తీవ్ర అన్యాయం

- పాడేరు మెడికల్ కాలేజీలో 50 ఎంబిబిఎస్ సీట్లు కోల్పోయాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తోనే పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025-26 అకడమిక్ ఇయర్‌కు 50 ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయామని, ఈ నిర్లక్ష్యం ఆదివాసీ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావితం ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనరస విమర్శించారు. పాడేరు ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం విద్య, వైద్యం అందరికీ అదించాలని గతంలో చేసిన పోరాట ఫలితంగా గత ప్రభుత్వం మెడికల్ కాలేజీ మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం రూ. 500 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించారనీ 2024-25లో ఎన్ఎంసీ మొదటి దశలో 50 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. మిగిలిన 100 సీట్లు (మొత్తం 150) 2025-26కు పెంచాలని ప్రతిపాదించారన్నారు. ఈ ఏడాది ఈ ప్రక్రియలో అవసరమైన డాక్యుమెంట్లు, మౌలిక సదుపాయాల స్థితి నివేదికలు, ఫ్యాకల్టీ లిస్టులు సమయానుకూలంగా డాక్యుమెంట్ ఎన్ఎంసికి సమర్పించకపోవడంతో ఎన్ఎంసీ 50 సీట్లు (మొత్తం పెంపు నుంచి) తిరస్కరించిందన్నారు. ఇప్పుడు కళాశాలకు కేవలం 50 సీట్లతోనే కొనసాగాల్సి వచ్చిందన్నారు. ఎన్ఎంసీ అధికారిక నోటిఫికేషన్‌ల ప్రకారం, మౌలిక సదుపాయాల పూర్తి లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం (డాక్యుమెంట్లు సమర్పణలో ఆలస్యం), బడ్జెట్ కేటాయింపుల లోపాలు (పనులు పూర్తి కాకపోవడం) కారణాలుగా తెలిసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం 2024 జూన్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత, వైద్య విద్యా విస్తరణకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చిందని, , హామీ ప్రకారం పాడేరు కాలేజీలో అడ్మిషన్స్ ప్రారంభించారన్నారు.ఈ హామీ ఈ ఏడాది కూడా అమలు చేయకుండా కేవలం కాగితం మీదే ఉన్నాయన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తిగా ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. పాడేరు కళాశాలలో భవనాలు, ల్యాబ్‌లు, హాస్పిటల్ బెడ్‌లు (కనీసం 300 బెడ్‌లు ఎన్ఎంసీ నిబంధన) పూర్తి కాకపోవడం, గత ప్రభుత్వం 80శాతం పనులు పూర్తి చేసినప్పటికీ, మిగిలిన 20శాంతకు అదనపు రూ.330 కోట్లు కేటాయించలేదన్నారు. పనులు ఆలస్యం అయ్యిందని, దీనికి తోడుగా ఎన్ఎంసీ అభ్యర్థనలకు (ఆగస్టు-సెప్టెంబర్ 2025) అవసరమైన ఫ్యాకల్టీ లిస్ట్‌లు, ఆర్థిక నివేదికలు, సైట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టులు సమయానుకూలంగా సమర్పించలేదన్నారు. 2025-26 బడ్జెట్‌లో వైద్య కళాశాలలకు కేటాయింపు గత ఏడాదికి తగ్గిందని (రూ. 1,200 కోట్ల నుంచి రూ. 800 కోట్లకు). పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్‌పై దృష్టి పెట్టడంతో ప్రభుత్వ కళాశాలలపై ప్రాధాన్యత తగ్గిందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో 50 మంది విద్యార్థులు (ముఖ్యంగా ఆదివాసీలు) ఉచిత ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఎంసీతో తక్షణమే చర్చలు జరిపి, 2025-26కు 50 సీట్లు మళ్లీ మంజూరు చేయాలని, అవసరమైతే స్పెషల్ అప్పీల్ దాఖలు చేయాలని, పాడేరు కళాశాలలో మిగిలిన పనులకు రూ. 330 కోట్లు అదనంగా కేటాయించి, 3 నెలల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి. దాస్, పాడేరు పార్టీ మండల కార్యదర్శి సోమేలి చిట్టిబాబు, డూరు బొజ్జన్న పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు చేయూత

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రతి ఒక్క మహిళ లక్షాధికారిణి కావాలని లక్ష్యంతో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందజేస్తుందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో ఆయన డుంబ్రిగుడ మండలంలోని 38 స్వయం సహాయక సంఘాల గ్రూపుల సభ్యులకు 2కోట్ల 10 లక్షల10 వేల రూపాయల చెక్కును అందజేశారు. స్వయం సంఘ సభ్యులందరూ ఈ రుణాలను ఉపయోగించుకొని తిరిగి వాయిదా పద్ధతుల ద్వారా బ్యాంకులకు చెల్లించలన్నారు. డుంబ్రిగుడ మండలానికి చెందిన మల్బరీ తోటలా పెంపకం దారులకు 6 మంది గ్రూప్ సభ్యులకు ఒక లక్ష రూపాయలు చొప్పున ఆరు లక్ష రూపాయల వడ్డీ లేని రుణం వడ్డీ లేని రుణం బ్యాంకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వరరావు, డి ఆర్ డి.ఏ పిడి వి.మురళి, ఎల్‌డిఎంఎం. మాతు నాయుడు, జిల్లా పట్టు పరిశ్రమల అధికారి కె.అప్పారావు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్

రోడ్డు పనులపై వినతి

ప్రజాశక్తి-కాశీపట్నం: అనంతగిరి మండలం పైనంపాడు పంచాయతీ ముళ్ళపట్టం గ్రామంలో నిర్మాణం చేపట్టిన రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి శివేరి కొండలరావు శుక్రవారం గ్రామ సచివాలయం అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముళ్లపట్టం గ్రామంలోని నిర్మించిన రోడ్డు మొంథా తుఫాన్ దాటికి కొట్టుకు పోయిందన్నారు. దీంతో గిరిజనుల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, చిట్టిబాబు, చంద్రన్న పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు

అడపవలసలో శీతల పండగ

- నూర్పుల కల్లంలో భోజనాలు



కల్లం వద్ద భోజనాలు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వ్యవసాయ పంటలు పండించి వరి నూర్పులు చేసిన తర్వాత పూర్వం తాత, ముత్తాతల నుంచి ఆదివాసి గిరిజన సాంప్రదాయబద్ధంగా వస్తున్న శీతల పండగను మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనులు ఘనంగా జరుపుకుంటున్నారు. చేతి కంది వచ్చిన వరి పంటలను కోతలు కోసి ఆ తర్వాత కల్లంలో నూర్పులు చేసి కుటుంబ సమేతంగా బంధువులతో వంటలు చేసి ఒకే చోట గిరిజనులంతా భోజనాలు చేసి ఘనంగా జరుపుకొని ఆనందంగా గడుపుతున్నారు.

మండలంలోని అడపవలస గ్రామంలో గెమ్మెలి రామన్నకు చెందిన వరి పంటను నూర్పు చేసి గురువారం కుటుంబ సమేతంగా ఆ గ్రామంలోని కల్లంలో వంటకాలు చేసి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. వరి పంటలు నూర్పులు చేసిన అన్ని గ్రామాల్లో గిరిజన సంప్రదాయ బద్ధంగా ఈ పండుగను జరుపుకుంటున్నారు. ఈ పండుగను వరి నూర్పులు చేసే సమయంలో కుటుంబీకులతో పాటు బంధువులు, మిత్రులు, గ్రామస్తులను ఆహ్వానిస్తారు. ముందుగా వరి నూర్పులు చేసిన తర్వాత మిగిలిన గడ్డిని కాలుస్తారు. ఆ తర్వాత వంటకాలు చేసి ఆదివాసి గిరిజన సంప్రదాయబద్ధంగా కల్లం మధ్యలో వరి పంటను పోగు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందరూ భోజనాలు చేసిన తరువాత వరి పంట నూర్పులు చేసిన యజమాని తన చెయ్యితో వరి పంట గింజలను తీసి ఓ గంపలో పెట్టి తమ ఇంటికి తీసుకుని వెళ్లి ఉంచుతారు. ఈ విధంగా చేస్తే వచ్చే ఏడాది కూడా పంట దిగుబడి బాగా వస్తుందని గిరిజనుల సంప్రదాయ నమ్మకం. భోజనాల అనంతరం ఆదివాసి గిరిజన ఒరియా పాటలను సరదాగా అందరూ పాడి పండగను ముగిస్తారు. అడపవలసలో గురువారం నిర్వహించిన శీతల పండగలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు రాంప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గసభ పంచాయతీ పరిధి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేసినట్లు గసభ పంచాయతీ మాజీ సర్పంచ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. గరిడేలు గ్రామంలో అడవి తల్లి బాట రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచి పోయిందని, వెంటనే పూర్తి చేయాలన్నారు. నాడు నేడు పథకం కింద మంజూరైన గొందివలస, చిమిలిగూడ, జంగిడివలస, మొర్రిగూడ పాఠశాల భవనం వెంటనే నిర్మాణం చేయాలనీ, పాఠశాల భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారనీ చెప్పారు. పాడేరు జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఉన్న మొర్రిగూడ టీచర్‌ను వెంటనే మొర్రిగూడ పాఠశాలకు పంపించాలని, ఉపాధ్యాయుల కొరత ఉండటంతో విద్యాబోధన కష్టంగా మారిందన్నారు. వెంటనే ఉపాధ్యాయుని నియమించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ పి సత్యనారాయణ, సిపిఎం నాయకులు పద్దు, బాస్కరరావు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని చూపుతున్న నాయకులు



సాయిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది, కోచ్

జాతీయ స్థాయి విలు విద్య పోటీలకు శ్రీ మోదమాంబ హైస్కూల్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలోని శ్రీ మోదమాంబ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి చిట్టపులి మోహిత్ సాయి జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి.నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోహిత్ సాయిని, తల్లిదండ్రులకు పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, కోచ్ అడపా సుధాకర్ నాయుడు, సీనియర్ విలువిద్య క్రీడాకారులు అభినందించారు. ఇంటివల నూజివీడులో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్, సీనియర్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్



కూనవరం : సీతక్క స్తూపం వద్ద కిరణ్ తదితరులు

ప్రజాశక్తి- ఎటపాక: ఆదివాసుల కోసం పోరాడుతూ ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సిపిఎం ఎఎస్ఆర్ రంప చోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. చింతూరులో ఈ నెల 24న జరిగే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఎర్రబోరులో శుక్రవారం ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఐ.వి. అధ్యక్షతన అమరజీవి ఇరపా శ్రీరాములు స్తూపం వద్ద సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు జెండా ఆవిష్కరించారు.కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బుద్దుల భద్రయ్య, సవలం రాము, జి.హుస్సేన్, కె.ఎస్.పురం శాఖ కార్యదర్శి సీసం అర్జున్, గుండాల కాలనీ శాఖ కార్యదర్శి తోట శ్రీను, నూతలపాటి సుధాకర్, పెనుబల్లి భీష్మారావు తదితరులు పాల్గొన్నారు.



ఎటపాక : జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కూనవరం : స్థానిక పార్టీ కార్యాలయం ముందు ఉన్న పాయం సీతక్క స్తూపానికి రంగులు వేశారు. అనంతరం బొప్పెన కిరణ్ మాట్లాడుతూ అంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు,పాయం సీతారామయ్య, బాబు బొర్రయ్య, మడకం నాగమణి తాళ్లూరి శ్రీనివాసరావు, తెల్లం తమ్మయ్య, మడెం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌పురం: కుంజవారిగూడెంలో సీనియర్ నాయకులు కుంజ రాజయ్య జెండా ఆవిష్కరించారు. తెల్లవారి గూడెం, టేకులూరు కుందులూరు పలు గ్రామాల్లో ఆయా నాయకులు జెండా ఆవిష్కరించారు. ములకనపల్లిలోశాఖ సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు మాట్లాడుతూ భీష్మారావు, బండార్ చందర్‌రావు అమరులై నేటికి 40 ఏళ్ళు అయినా వారిని స్మరించుకుంటు న్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు పోడియం శ్రీరామ్ మూర్తి, కమ్మ చిచ్చు సత్యనారాయణ, ప్రజా ప్రతినిధి సవలం మారయ్య, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి బడుగు రమేష్‌బాబు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలో సి.డి.పాలెం, ఎం.మాకవరం, శరవన్నపాలెం రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు శుక్రవారం ప్రారంభించారు. చీడుపాలెంలో ఎంపిపి బడుగు రమేష్‌బాబు ప్రారంభించారు. ఎం.మాకవరం సర్పంచ్ కోడా చింతల్లి రాజుబాబు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు మోహన్, టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్య దర్శి కొర్రు రామ్మూర్తి, వీహెచ్ఎ ఎం.సంధ్యారాణి తదితరులు కొనుగోళ్ల ప్రారంభించారు. గ్రేడ్ వన్ రకం క్వింటాకి 2,389. అలాగే 75 కేజీలు అయితే 1792. ధర నిర్ణయించి పత్రం విడుదల చేశారు. పండించిన ధాన్యాన్ని ఆర్ఎస్కేల ద్వారా విక్రయించాలని ధాన్యం తేమ లేకుండా చూసుకోవాలని రైతులకు ఎఒ సూచించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎటిడబ్ల్యూ క్రాంతికుమార్

వసతిగృహ విద్యార్థినులు డిశ్చార్జ్

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం వసతిగృహంలో అస్వస్థతకు గురైన విద్యార్థినులు పూర్తిగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్టు ఎటిడబ్ల్యూ క్రాంతికుమార్ తెలిపారు. విశాఖలో ఉన్న ముగ్గురిలోనూ ఇద్దరు విద్యార్థి డిశ్చార్జ్ అయినట్టు మిగిలిన ఒక్క విద్యార్థిని కూడా రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం బాగానే ఉందని తల్లిదండ్రులకు తెలిపారు.



అప్పలరాజుపేట రిజర్వాయర్ కాలువలో పేరుకుపోయిన చెత్త

పంట కాలువలో వ్యర్థాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక పోస్టాఫీస్ సమీపంలో అప్పలరాజుపేట రిజర్వాయర్‌కు చెందిన పంట కాలువలో ప్లాస్టిక్ కాగితాలు, కవర్లు, ఇళ్లలో చెత్త, చెదారం వేస్తున్నారని. దీంతో కాలువలో నీరు నిలిచిపోతోందని అధికారులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంట కాలువ ద్వారా సుమారు 1500 ఎకరాలకు నీరు అందాల్సి ఉందని, పూడికతీత పనులు చేపట్టాలని పదేపదే రైతులు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని దూసరపాము ఎంపిటిసి నల్లా సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- మోతుగూడెం: అల్లూరి జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫార్బయ్‌లోని కెనాల్‌లో బుధవారం ఈతకని దిగి ప్రవాహంలో కొట్టుకుపోయిన గనిశెట్టి జగదీశ్వరరావు (26) మృతదేహం శుక్రవారం రిజర్వాయర్‌లో లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి పంపించిన మోతుగూడెం పోలీసు సిబ్బంది, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా మోతుగూడెం ఎస్ఐ సాదిక్ మాట్లాడుతూ పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని , సీలేరు నది, పవర్ కెనాల్, రిజర్వాయర్, సోకులేరువాగుల్లో ఈతకు దిగకూడదని హెచ్చరించారు.

వనభోజనాల సందడి

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండ దారాలమ్మ ఆలయ సమీపంలో వనభోజనాల సందడి నెలకొంది. శుక్రవారం కార్తీకమాసం చివరిరోజు పోలిపాడ్యమి కావడంతో దారకొండ గుమ్మరేవులు దుప్పిలివాడ పంచాయతీల ప్రజలు అమ్మవారి సన్నిధిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వన భోజనాలు కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సహపంక్తి భోజనాలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ కన్నప్పరాజు

ప్రయాణికుల భద్రత విషయంలో రాజీ తగదు

ప్రజాశక్తి- విఆర్‌పురం : బోటు ప్రయాణికుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికుల భద్రత విషయంలో రాజీ పడకూడదని, పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ కన్నప్పరాజు, సూచించారు. ఎస్ఐ సంతోష్‌కుమార్ అగ్నిమాపకదళం సిబ్బందితో శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ బోటు యజమానులందరికీ తగిన సూచనలు చేశారు. మద్యం తాగి బోటు నడపరాదని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఫైర్ డిపార్ట్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో తనిఖీలు

ప్రజాశక్తి - కొయ్యూరు: గంజాయి, నాటుసారా నిర్మూలనకు డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, విస్తతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్. రేవతమ్మ తెలిపారు. మండలంలోని భీమవరం పోలీస్ చెక్ పోస్టు వద్ద ఆమె తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, బంగారమ్మపేట-అంతాడ రహదారి తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాను ఎగురవేశారు. ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.

పిహెచ్‌సికి డిప్యుటేషన్‌పై ఇద్దరు వైద్యులు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యాధికారులను నియమిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిఎంహెచ్ఒ కృష్ణమూర్తినాయక్ డిప్యూటేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం డాక్టర్ వి. అఖిల్, డాక్టర్ నారాయణరావు బాధ్యతలు చేపట్టారు. వీరు అల్లూరి సీతారామరాజు జిల్లాలో వైద్యారోగ్య శాఖలో ప్రోగ్రామింగ్ అధికారులుగా కొనసాగారు. వైద్య అధికారులు నియమించడంపై కలెక్టర్‌కు, డిఎంహెచ్ఒకు ఈ ప్రాంత ప్రజలు ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టర్ అఖిల్



డాక్టర్ నారాయణరావు




సర్వే చేస్తున్న ఎఎంఒ భాస్కరరావు

దోమల నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని దోమల నివారణకు గ్రామస్తులు సహకరించాలని ఎఎంఒ భాస్కరరావు అన్నారు.శుక్రవారం మారేడుబాక పంచాయితీ మంగంపాడులో వైద్యసిబ్బందితో కలిసి ఏంఎంవో భాస్కరరావు ఇంటింటా సర్వే చేపట్టారు. ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పావని, వైద్యసిబ్బంది సోమరాజురెడ్డి, భూముల వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం దారకొండ పంచాయతీ రోలుగుంటలో మీని అంగన్‌వాడి కేంద్రం ఏర్పాటుచేసి కార్యకర్తను నియమిం చాలని అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కి శుక్రవారం వినతిపత్రం అందజేశామని ఎపి గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి కూడా రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోలుగుంట గ్రామంలో సుమారు 160 మంది జనాభా ఉన్నారని ఐదు సంవత్సరాల పిల్లలు 20 మంది ఉన్నారని చిన్నగంగవరంలో అంగన్వాడి కేంద్రానికి తమ పిల్లల్ని పంపాలంటే సుమారు కిలోమీటర్ దూరం ఉండటమే కాకుండా వాగు దాటి పిల్లలు వెళ్లలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.



వినతిపత్రంచూపుతున్న రామకృష్ణ

మార్చి 16 నుంచి టెన్త్ పరీక్షలు

జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు వెల్లడి

ప్రజాశక్తి -పాడేరు:2026 మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు టెన్త్ క్లాస్ పరీక్షలు జరుగుతాయని అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి పి బ్రహ్మాజీరావు స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఏపీఎస్ఎస్‌సి బోర్డు శుక్రవారం టైం టేబుల్ విడుదల చేసిందని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 268 పాఠశాలలకు చెందిన సుమారు 12 వేల 101 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. అన్ని పరీక్షలు ఉదయం 9:30 నుంచిలు మధ్యాహ్నం 12 45 వరకు జరుగుతాయని ఆయన చెప్పారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

మట్టి రోడ్డు పనులు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ:మండలంలోని కంద్రుమ్ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో శుక్రవారం మట్టి రోడ్డు నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల లోపల రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో బురదమయంగా ఉండటంతో విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ నిధులతో రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్య కమిటీ చైర్పన్ టి ప్రతాప్, పీసా ఉపాధ్యక్షుడు టి.పట్నాయక్, జగన్నాథ్, ప్రధానోపాధ్యాయుడు కొండబాబు, సూర్యనారాయణ పడాల్, సంజీవరావు పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ సభ్యునికి ఘన సన్మానం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యునిగా పదవి బాధ్యతలు చేపట్టిన కిల్లో సాయిరాంకు మండలంలోని కించుమండ టిడిపి అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు ఇంటి వద్ద శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి , శాలువా కప్పి సన్మానించారు. అనంతరం అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాలపై ఎస్‌టి కమిషన్ సభ్యుడు ఆదివాసీల పక్షాన నిష్పక్షపాతంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ ఎస్ లక్ష్మణుడు, మాజీ ఎంపీటీసీ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



కిల్లో సాయిరామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

అప్పగింతలో ఆలస్యమెందుకో?

- సొంత భవనమున్నా అద్దె కొంపలో అంగన్వాడీ కేంద్రం
- ఇరుకు గదిలో అవస్థలు - వరండాలోనే సేవలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అన్ని ఉన్నా అల్లుడినోట్లో శని అన్న చందాన ఉంది అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ శరభగూడ అంగన్వాడీ కేంద్రం పరిస్థితి. సొంత భవనం నిర్మాణం పూర్తయినా, నేటికీ ఇరుకైన అద్దె భవనంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తూ అటు సిబ్బంది, ఇటు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం అప్పగింతలో నిర్లక్ష్యం, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని స్థానికులు మండిపడుతున్నారు. శరభగూడ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటైన నాటినుంచి అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు. ఇరుకు గదిలో గర్భిణులు, బాలింతలు, కిశోరబాలలు ఇబ్బందులు పడడం, ఆగినంత స్థలం లేకపోవడం వల్ల చిన్నారులకు ఆటలు, పాఠాలు అవస్థలు కలుగుతున్నా ఇన్నాళ్లు ఎలాగోలా నెట్టుకొచ్చారు. అంగన్వాడీ నిర్వాహణకు పడుతున్న ఇబ్బందులను గుర్తించి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరుచేసి సొంత భవన నిర్మాణం పూర్తిచేశారు. అయితే దాన్ని సంబంధిత ఐసిడిఎస్ శాఖకు అప్పగించకపోవడంతో నేటికీవసతి కష్టాలు తీరని పరిస్థితి నెలకొంది. సొంతభవనమున్నా నెలసరి అద్దె చెల్లిస్తూ నేటికీ ఇరుకు గదుల్లోనే పౌష్టికాహారం పంపిణీ, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తోంది. ఇకనైనా చేయించుకోవడానికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు అద్దె భవనంలో కనీసం కూర్చోవడానికి స్థలం కూడా లేకపోవడంతో ఆరుబయట వరండాల్లోనే పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. నూతన భవనం పూర్తయినప్పటికీ, దాన్ని అధికారికంగా అప్పగించే ప్రక్రియలో ఆలస్యం జరుగుతుండటంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరకులోయ సిడిపిఒ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న శరభగూడ అంగన్వాడీ కేంద్ర భవన సమస్యను అధికారులు ఎందుకు పరిష్కరించడం లేదో ఇప్పటికీ అంతుపట్టడంలేదు. విశాలమైన, శుభ్రమైన, సురక్షిత వాతావరణంలో కొత్త భవనం నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని, అద్దె భవనం నుంచి సొంత భవనంలోకి అంగన్వాడీ కేంద్రాన్ని తరలించే చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.



నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాని అంగన్వాడీ భవనం

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా చైర్మన్ విక్రం దేవ్



విద్యార్థులతో చైర్మన్ విక్రందేవ్

ప్రజాశక్తి -దుంబ్రిగుడ:గిరిజన విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా పాఠశాలల్లో కనీసం మౌలిక సౌకర్యాలు కల్పించాలని వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా చైర్మన్ విక్రం దేవ్ కోరారు. ఆ సంఘం నాయకులు మండలంలోని గుంట సీమ పంచాయతీ పరిధిలో పళ్ళు ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల అందిస్తున్న బోధన తీరును పరిశీలించారు. దీంతోపాటు ప్రభుత్వం పాఠశాలలకు కల్పిస్తున్న వసతుల సౌకర్యాలపై కూడా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరగతి గదులలో విద్యుత్ స్మార్ట్ టీవీతో పాటు ఇంటర్నెట్ సౌకర్యం అదనపు భవన నిర్మాణ సౌకర్యాలు కల్పించాలన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సిబ్బంది కొరత ఉందని, అదనపు ఉపాధ్యాయులను నియమించాలని చెప్పారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-చింతపల్లి: సర్వీసులో ఉండగానే మరణించిన అంగన్వాడి కార్యకర్తల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం చింతపల్లి మండలం తాజంగి పంచాయతీ తాలకోట గ్రామానికి చెందిన మినీ అంగన్వాడి వర్కర్ సాగిన రాములమ్మ (55) అనారోగ్యంతో మృతి చెందగా, స్థానిక అంగన్వాడి కార్యకర్తలతో కలిసి బాధిత కుటుంబాన్ని చిన్నయ్య పడాల్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విధుల్లో ఉండగా మరణించిన అంగన్వాడీ కార్యకర్త కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన మట్టి ఖర్చులు సహా అన్ని రకాల ఆర్థిక సహాయాలు త్వరితగతిన అందించాలని కోరారు.కార్యక్రమంలో పాంగి ధనుంజయ్, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పెంటమ్మ, రాములమ్మ, వెంకటి, అక్కమ్మ, నీలమ్మ, సత్యవతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలు సమీకరించిన రూ.ఐదు వేల సాయాన్ని మతురాలి కుటుంబానికి అందించారు.

బస్తరు పిక్కలకు గిరాకీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఏజెన్సీలో ఈ ఏడాది కొత్తగా కాపు కాసిన బస్తరు పిక్కలకు గిరాకీ ఏర్పడుతుంది. ఈ ఏడాది కొత్తగా మార్కెట్లో దిగడంతో జనాలు ఈ పిక్కలను కొంటున్నారు. శుక్రవారం జరిగిన అరకు వారపు సంతలో బస్తర్ పిక్కలు కిలో రూ.300 ధరతో విక్రయించారు. అయినా సరే జనాలు వారపు సంతలో ఎగబడి మరీ కొనుగోలు చేశారు. దీంతోపాటు రాజ్‌మా పిక్కల కు కూడా అదే గిరాకీ మార్కెట్లో ఉంది. వాటిని సైతం జనాలు ఎగబడి కొంటున్నారు. ఈ పిక్కలకు గిట్టుబాటు ధర ఎక్కువగా ఉండటంతో వీటిని పండించిన గిరి రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



బస్తర్ పిక్కలు



పుస్తకాన్ని అందిస్తున్న సంఘం కో ఆర్డినేటర్ రమేష్

ఆంగ్ల భాష పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: గిరిజన విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి ఆంగ్ల బాష పట్ల నైపుణ్యం పెంచే విధంగా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని ఫార్వర్డ్ సంఘం అల్లూరి జిల్లా కోఆర్డినేటర్ కిమ్ముడు రమేష్ చెప్పారు. మండలంలోని గుంటగన్నేల పిట్టగూడా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆంగ్ల బోధనపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఆంగ్ల బాషపై బాగా చదువుతుండగా మరికొంతమంది వెనుకబడి ఉన్నారన్నారు. అటువంటి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఆంగ్లంపై పట్టు సాధించేవరకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు, పుస్తకాల వితరణ


ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని మారు మూల రొంపల్లి పంచాయతీ పరిధి గూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెనాలి ప్రాంతానికి చెందిన పవన్ కళ్యాణ్ అభిమానులు సొంత నిధులతో బ్యాగులు, స్వెటర్లు, దుస్తులు, పెన్నులు, పుస్తకాలు తదితర వస్తువులను అందజేశారు. గూడెం గ్రామానికి కొత్తగా విద్యుత్ ఏర్పాటుతో పాఠశాల భవనం ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి చొరవ తీసుకున్నారని అభిమానులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కూటమి నాయకురాలు లక్ష్మి . పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి కళ్యాణ్ కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.



సామగ్రిని ఇస్తున్న
పవన్ కల్యాణ్ అభిమానులు

ప్రజలకు న్యాయ సేవలందించండి

ప్రజాశక్తి- చింతపల్లి : చింతపల్లి, జికె వీధి, కొయ్యూరు మండలాల్లో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, న్యాయ సంబంధిత సేవలను స్వచ్ఛందంగా అందించాలని చింతపల్లి ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ జడ్జి డి.భరణి సూచించారు. శుక్రవారం పారా లీగల్ వాలంటీర్లుగా శిక్షణ పొందిన పనసల చిట్టిబాబు, కవడం కృష్ణలకు గుర్తింపు కార్డులు అందజేశారు.ఎటువంటి జీతభత్యాలు లేకుండానే ప్రభుత్వానికి వారధులుగా పారా లీగల్ వాలంటీర్లు పనిచేయాలన్నారు. వచ్చేనెల 13న చింతపల్లి ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌పై విస్తత ప్రచారం చేయాల్సిఇ సూచించారు.



గుర్తింపు కార్డులిస్తున్న జడ్జి భరణి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు

పారదర్శకంగా భూముల రీ సర్వే

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం): పదేపదే తలెత్తుతున్న భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమగ్ర ప్రణాళికతో కూడిన కార్యాచరణ రూపొందించాలని, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ఆచరణలో పెట్టి అమలు చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డులు, రెవెన్యూ శాఖ అధికారులను రాష్ట్ర శాసన సభాపక్ష ఫిర్యాదుల కమిటీ ఛైర్మన్, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు ఆదేశించారు. కమిటీ సభ్యులు కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజులతో కలిసి శుక్రవారం విశాఖ జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టరేట్ మీటింగ్ హాలులో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమగ్ర భూ రీసర్వే, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రికార్డుల నిర్వహణ, సరిహద్దుల గుర్తింపు, అభ్యంతరాల స్వీకరణ, సమస్యల పరిష్కారంలో కలెక్టర్, జెసి, ఆర్‌డిఒ, తహశీల్దార్ల పాత్ర, ప్రభుత్వ, ప్రయివేటు భూముల వర్గీకరణ, సర్వే ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. సర్వే, రెవెన్యూ చట్టాల్లో తీసుకురావాల్సిన సవరణలు, జిఓలపైనా చర్చించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చేపడుతున్న సమగ్ర భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, లోపాలు తలెత్తకుండా, గందరగోళం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రీ సర్వే చేయనున్న గ్రామాల్లో ముందుగా ఏయే పనులు చేయాలో తెలియజేశారు. రైతుల సమక్షంలోనే ప్రక్రియ మొత్తం సాగాలని, అభ్యంతరాల స్వీకరణకు వీలుగా మొబైల్ మెజిస్ట్రేట్ బృందాలు ప్రజలకు అందు బాటులో ఉండాలన్నారు. సమావేశంలో భాగంగా రీసర్వేకు సంబంధించిన వివరాలను సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల విభాగం డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్ కమిటీకి వివరించారు.

కిడ్నీ వ్యాధులపై సమగ్ర అధ్యయనం

- డాక్టర్ టి.రవిరాజు వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రవిరాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: శ్రీకాకుళం జిల్లాలో తీర ప్రాంత మండలాల్లో కిడ్నీ వ్యాధులపై సమగ్ర అధ్యయనం ప్రారంభించామని కిడ్నీ వ్యాధుల పరిశోధన ప్రాజెక్టు మెంటర్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ విసి, రిటైర్డ్ డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ టి.రవిరాజు తెలిపారు. శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల డాక్టర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో 18 శాతం జనాభా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నట్లు తమ పరిశోధనలో వెల్లడైందని ఈ నేపథ్యంలోనే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ కిడ్నీ వ్యాధులపై పరిశోధనలకు అనుమతి ఇచ్చిందని మూడేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి అవుతుందని పేర్కొన్నారు. ఇందుకు రూ. 6.01 కోట్లు కేటాయించినట్లు వివరించారు.ఉద్దానం ప్రాంతంలోని ఇచ్చాపురం కవిటి, కంచిలి, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో అధ్యయనం జరుగుతుందని చెప్పారు. ఈ నెల 1 నుండి ఈ ప్రక్రియ మొదలయిందన్నారు. ఆర్‌ఎన్‌ఎ సీక్వెన్సింగ్ విధానంలో జన్యుపరమైన పరీక్షలు కూడా ఈ పరిశోధనలో భాగంగా చేస్తామని తెలిపారు.

పారిశుధ్య పరిరక్షణతో ప్రజారోగ్యం



కొయ్యూరు: రావణాపల్లిలో రోడ్డు పక్కన తొలగిస్తున్న పిచ్చిమొక్కలు




విఆర్‌పురం: పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- కొయ్యూరు: గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణతోనే ప్రజారోగ్యం సాధ్యమని ఎంపిడిఒ ప్రసాదరావు అన్నారు. శానిటేషన్ డ్రైవ్లో భాగంగా డిప్యూటీ ఎంపిడిఒ బాబూరావుతో కలిసి శుక్రవారం రావణాపల్లిలో క్లీన్ విలేజ్-గ్రీన్ విలేజ్ కార్యక్రమం నిర్వహించారు. రావణపల్లి పంచాయతీ, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలతో కలిసి పారిశుధ్య పనులు, చెత్త తొలగింపు పనులు చేపట్టారు. చెత్త తొలగించడంతో పాటు రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను కూడా తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్‌పురం: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి సూచించారు. మండలంలో క్లీన్ అండ్ గ్రీన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా విఆర్ పురం మండలం వడ్డెగూడెం పంచాయతీ పరిధి శుక్రవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమం ఎంపిడిఒ ఇమ్మానుయేల్ పర్యవేక్షణలో జరిగింది. వడ్డిగూడెం సర్పంచ్ సోడే నర్సమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్‌పిటిసి రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామాలు శుభ్రంగా ఉంచుకో వాలని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు బొర్రా నరేష్, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని కొండపల్లి పంచాయతీలోని రెండు గ్రామాల్లో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ఎంపిడిఒ యాదగిరిశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కొండపల్లి పంచాయితీ ఆదర్శ పంచాయతీగా ఎంపికైన నేపథ్యంలో చెత్త లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సర్పంచ్ కుంజం జగన్నాథం, పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగి : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు

ఏకలవ్య పాఠశాలల్లో మెనూ అమలు చేయాలి

ప్రజాశక్తి - మారేడుమిల్లి: ఏజెన్సీలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలలో ప్రభుత్వ నిబంధన ప్రకారం మెనూ అమలు చేయాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. కాచి చల్లార్చిన తాగునీరు అందజేయాలన్నారు. వంటగదిని పరిశీలించారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయో రుచి చూసారు. అనంతరం ఆకుమామిడికోట గ్రామంలోని వారపు సంతను పరిశీలించారు. సంతలో ఏయే వస్తువులు విక్రయిస్తు న్నారో ఆరా తీశారు. నాణ్యమైన సరుకులు అమ్మాలని సూచించారు. గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజనీర్ చైతన్య, ఎంపిడిఒ కిషోర్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



వారపు సంతను పరిశీలిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్

12వ రోజుకు టిట్టిభ సత్యాగ్రహం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: తెలుగు భాష రక్షణ కోసం చేపట్టిన టిట్టిభ సత్యాగ్రహం శుక్రవారం నాటికి 12వరోజు చేరింది. పలువురు భాషాభిమానులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ,తెలుగు జాతి తరపున, తెలుగు భాష రక్షణ కోసం చేపట్టిన ఈ ప్రజాఉద్యమాన్ని నిరవధికంగా కొనసాగిస్తామని, అంతవరకూ భాషా పోరాటం ఆగదని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కొచ్చెర్లకోట, తిరుపతి ప్రసాదవర్మ, చేబియ్యం రవిమోహన్, పరమేశ్వరరావు, అల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

23 నుంచి కళాభారతిలో సంగీత సభలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 23 నుంచి 29 తేదీ వరకు కళాభారతిలో సంగీత సభలు నిర్వహించనున్నారు. విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సంస్థ యువకళాకారుల్ని ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సంగీత సభల్లో లబ్ధప్రతిష్ఠులైన సంగీతజ్ఞులు తమ విద్యను ప్రదర్శించనున్నారని విశాఖ మ్యూజిక్ అకాడమీ కార్యదర్శి సి.ఎ చంద్రశేఖర్ వీరఘంట మీడియాకు తెలిపారు.

24న సుబ్రహ్మణ్యంకు సంగీత కళా సాగర పురస్కారం

ఈ అకాడమీ ఏటా సమర్పించే ప్రతిష్ఠాత్మక 'సంగీత కళాసాగర' పురస్కారాన్ని ఈ సారి చెన్నైకి చెందిన ప్రఖ్యాత వాయులీన విద్వాంసులు వివి సుబ్రహ్మణ్యంకు అందజేయనున్నామన్నారు.ఈ నెల 24 న నిర్వహించే ప్రత్యేక సభలో ఆయన ఈ అవార్డు ప్రదానం ఉంటుందన్నారు. వేడుకల్ని నోవస్ కనస్ట్రక్షన్స్, క్రెడాయ్ విశాఖ చాప్టర్ చైర్మన్ ధర్మేందర్ వరద ఈ నెల 23 న సాయంత్రం 6.15గంటలకు ప్రారంభించనున్నట్టు తెలిపారు.ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

చిన్నారి గుండె శస్త్ర చికిత్సకు స్పీకర్ సాయం

ప్రజాశక్తి - గొలుగొండ (అనకాపల్లి): గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామానికి చెందిన షేక్ వహీదా బేగం గుండె సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసి శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సాయం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. చిన్నారి గుండెలో రంధ్రం ఉండటం వల్ల ఆపరేషన్‌కు విశాఖపట్నం ఆసుపత్రిలో సుమారు రూ.5 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. చిన్నారి కుటుంబానికి అంత స్థోమత లేకపోవడంతో స్థానిక నాయకులు కామిరెడ్డి గోవింద్, షేక్ అజీన్ ఈ విషయాన్ని స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ పద్మావతి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే ఈ విషయాన్ని స్పీకర్‌కు తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించారు. చిన్నారి వహీదాను తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి తక్షణ చికిత్స నిమిత్తం పంపించారు. అక్కడి డాక్టర్లతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా ఫోన్‌లో మాట్లాడి పాపపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో అక్కడి వైద్య సిబ్బంది తగిన మందులతో వహీదాను క్షేమంగా ఇంటికి పంపించారు. కోలుకున్న చిన్నారిని శుక్రవారం కామిరెడ్డి గోవింద్, గ్రామ నాయకులు పరామర్శించారు. తమ బిడ్డకు ప్రాణం పోసి, క్షేమంగా ఇంటికి తీసుకువచ్చినందుకు స్పీకర్ కుటుంబానికి ఎల్లవేళలా రుణపడి ఉంటామంటూ వహీదా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పారా స్విమ్మింగ్ విజేతలకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఈ నెల 15 నుంచి 18 వరకూ హైదరాబాద్ బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 25వ జాతీయ పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో విజేతలైన విశాఖపట్నం పారా స్విమ్మింగ్ క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అభినందించారు. హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో విశాఖపట్నం జిల్లాకు చెందిన క్రీడాకారులు వలసనైని రవి (100 మీటర్లు) ఫ్రీ స్టైల్‌లో స్వర్ణ పతకం,50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ లో రజతం, కౌశర్ సాహిల్ షేక్ 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ లో (స్వర్ణ పతకం) ,50 మీటర్లు ఫ్రీ స్టైల్ లో స్వర్ణం, 100 మీటర్లు ఫ్రీ స్టైల్ లో రజత పతకం, ఆడారి ప్రణీత్ 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ లో స్వర్ణం, 100 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ లో స్వర్ణం,100 లో కాంస్యం, నిధి బైపోతు 100 మీటర్లు బ్యాక్ స్ట్రోక్‌లో స్వర్ణం,50 మీటర్లు ఫ్రీ స్టైల్ లో రజతం, సాలపు పూర్ణ చంద్ర రావు 100 మీటర్లు ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం,50 మీటర్లు ఫ్రీ స్టైల్లో కాంస్య పతకం,ఎం.సాయి నిఖిల్ గౌతమ్ 100 మీటర్లు బ్రెస్ట్ స్ట్రోక్ లో కాంస్య పతకాలు కావ్య 50 ఫ్రీ స్టైల్‌లో స్వర్ణం సాధించారు. క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు.